నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 28 ఏప్రిల్ 2024 | NIZAMABAD

అట్టహాసంగా ఆవిర్భావ దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాలను పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించాయి. బాన్సువాడలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి గులాబీ జెండాను ఎగురవేశారు. నిజామాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మేయర్ నీతూకిరణ్, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ స్మృతులను నెమరవేసుకున్నారు.

గాంధారి, భిక్కనూరులోని వడ్డీ వ్యాపారుల దుకాణాల్లో సోదాలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

బీర్‌షెబా కథ కంచికేనా?

- నాలుగేళ్లుగా దర్యాప్తులో పురోగతి కరువు
- వేలాది మంది సామాన్యులే బాధితులు
- వడ్డీ వ్యాపారులపై దాడులతో మరోసారి చర్చ
- ఎస్పీ సింధూ శర్మ పట్టించుకోవాలని వేడుకోలు

ఉమ్మడి జిల్లాలో వడ్డీ వ్యాపారులపై దాడుల నేపథ్యంలో 'బీర్‌షెబా' వ్యవహారం తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన భారీ ఆర్థిక మోసంపై పోలీస్ శాఖ మౌనం వహిస్తుండడం తాజాగా చర్చనీయాంశమైంది. సరిగ్గా నాలుగేళ్ల క్రితం కామారెడ్డి జిల్లా కేంద్రంగా వెలుగు చూసిన రూ.వందల కోట్ల ఆర్థిక మోసంలో బాధితులు వేలల్లో ఉన్నారు. సదాశివనగర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి కొంత మంది పోలీసుల సహకారంతో నెలల వ్యవధిలోనే ప్రజల నుంచి వందల కోట్ల రూపాయలను వసూలు చేసి పరారయ్యాడు. మొదట్లో ప్రజలకు లాభాలను పంచి పెడుతున్నట్లు నటించి, అందరినీ నమ్మించాడు. ఆశ పడి డబ్బులు పెట్టిన సామాన్యులను నిలువునా ముంచేశాడు. ఇంత భారీ ఆర్థిక మోసంలో నాడు పోలీసులు సైతం పాత్రధారులుగానే ఉన్నట్లు ప్రజలు అనుమానించారు. అక్రమంగా కోట్లల్లో లావాదేవీలు జరిపినా అప్పట్లో కళ్లు మూసుకున్నారు. నాడు డీఎస్పీ, సీఐలుగా పని చేసిన వారి నుంచి లభించిన మద్దతుతో అక్రమార్కులు రెచ్చిపోయారు. వీరిలో ఇద్దరు అధికారులు వేరే అక్రమాల్లో ఏసీబీకి చిక్కి జైలు పాలయ్యారు. మరికొంత మంది చాకచక్యంగా తప్పించుకుని ఇప్పుడు కామారెడ్డి జిల్లాలోనే కీలక పోస్టింగ్‌లలో రాజ్యమేలుతుండడం గమనార్హం. ప్రస్తుతం వడ్డీ వ్యాపారులపై పోలీసులు దాడులు చేస్తున్న తరుణంలో బీర్‌షెబా కేసు ఏమైదంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు.

–నిజామాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- రూ.300 కోట్లకు పైగా ఆర్థిక మోసం
- కామారెడ్డి పోలీసుల మౌనం

కష్టపడి సంపాదించుకున్న పదో, పరకో పెట్టుబడి పెడితే రెట్టింపు నగదు వస్తుందన్న ప్రచారం సామాన్యులను నిండా ముంచింది. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో సంపాదన అన్నది కుటుంబ పోషణ, జీవన గమనానికి సరిపోతుంది. శ్రమకోర్చే జీతంతోపాటు అదనంగా వచ్చే ఆదాయంతో సులభంగా తమ అవసరాలను తీర్చుకోవచ్చని భావిస్తుంటారు. అలా ఆశపడిన వారినే బుట్టలో వేసుకున్నారు. బీర్‌షెబా పేరిట ఆర్థిక కార్యకలాపాలను నడిపి నట్టేట ముంచేశారు. రూ.30వేలు చెల్లిస్తే వరుసగా ఆరు నెలల పాటు రూ.10 వేలు చొప్పున అంటే మొత్తం రూ.60వేలు ఇస్తామంటూ నమ్మించి సామాన్యులను మోసం చేసిన ఘటనే బీర్‌షెబా వ్యవహారం. గొలుసు కట్టు వ్యాపారం తరహాలో రెట్టింపు లాభాల ఆశను చూపి, భారీ నజరానాలు, బహుమతులతో ఆకర్షించి వేల మందిని మోసగించిన ఘటనకు నాలుగేళ్లవుతున్నది. రూ.300కోట్లతో దుకాణం ఎత్తేసిన ఈ వ్యవహారం ఇప్పుడు మరోసారి తెరపైకి వచ్చింది. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డితో పాటు హైదరాబాద్ చుట్టు ప్రాంతాల వారు సైతం డబ్బులకు ఆశపడి పెట్టుబడులు పెట్టారు. కొద్ది కాలం పాటు నిర్వాహకులు సవ్యంగానే డబ్బులు తిరిగి ఇచ్చారు. ప్రజల సొమ్మును రొటేషన్ పద్ధతిలో తిప్పి వాటిని ఇతరత్రా వ్యాపారాల్లో, భూములపై పెట్టుబడులు పెట్టారు. బీర్‌షెబా స్కీమ్ ప్రారంభ దశలో లాభాలు ఆర్జించిన వారు మినహా ఆ తర్వాత అత్యాశకు వెళ్లిన వారు, చివరకు రెట్టింపు లాభాల కోసం పెట్టుబడులు పెట్టిన వారం తా నిండా మునిగిపోయారు.

స్పందించేనా?

వడ్డీ వ్యాపారుల ఆట కట్టిస్తున్న పోలీసులు గతంలో కామారెడ్డి వేదికగా జరిగిన ఆర్థిక మోసాన్ని ఛేదిస్తారా.. లేదా? అన్నది జవాబు లేని ప్రశ్నగా మారింది. శ్వేతారెడ్డి ఎస్పీగా ఉన్నప్పుడు ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఆమె బదిలీ అయిన తర్వాత శ్రీనివాస్‌రెడ్డి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. కొంతమంది బాధితులు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. నిఘా విభాగంలో పని చేసిన ఓ వ్యక్తి ఎస్పీని తప్పుదారి పట్టించినట్లు పోలీస్ శాఖలో చర్చ జరిగింది. ఇప్పుడు అదే వ్యక్తి కీలకమైన పోస్టులో పని చేస్తున్నారు. బీర్‌షెబా ఉదంతం వెలుగు చూసిన సమయంలో డీఎస్పీ, టౌన్ సీఐలు, గ్రామీణ ప్రాంత పోలీసు అధికారులు విచ్చలవిడిగా డబ్బులు సంపాదించారనే ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగానే మోసపూరిత వ్యాపారం జరుగుతున్నదని తెలిసినా దాడులు చేయక మిన్నకుండిపోయారనే వాదన వినిపించింది. బీర్‌షెబా వ్యవహారాన్ని కూపీ లాగితే చాలా మంది అక్రమార్కులు బయటపడే అవకాశముంది. భారీ మోసానికి పాల్పడిన కీలక నిందితుడు ఇప్పుడు దర్జాగా తిరుగుతుంటే.. మోసపోయిన బాధితులు తెల్లమొహం వేస్తున్నారు. సంచలనం సృష్టించిన ఈ ఆర్థిక నేరానికి సంబంధించిన ఫైల్‌ను తెరిచి కేసును ఛేదిస్తే వేలాది కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. వడ్డీ వ్యాపారులపై కొరడా ఝుళిపిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్న ఎస్పీ సింధూ శర్మ.. బీర్‌షేబా కేసును కూడా ఛేదించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ప్రజల్లో వ్యతిరేకతతోనే
దేవుళ్ల మీద ఒట్టు వేస్తున్నారు

- సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం
- పలు గ్రామాల్లో రోడ్ షో
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం



రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, హాజరైన ప్రజలు

ఏర్గట్ల/ భీమ్‌గల్, ఏప్రిల్ 27 : ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం కావడం, పాలనపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ప్రజలను నమ్మించడానికి దేవుళ్ల మీద ఒట్టు వేస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వేసే ఒట్లకు దేవుళ్లు సైతం భయపడతారని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఏర్గట్ల మండలంలోని తాళ్ల రాంపూర్, గుమ్మిర్యాల్‌తోపాటు భీమ్‌గల్ మండలంలోని రహత్‌నగర్, దేవక్కపేట్ గ్రామాల్లో శనివారం సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన పెన్షన్ పెంపు, ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం, రైతు భరోసా, రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు తదితర హామీలను నెర్చవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ గత పార్లమెంట్ ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కాడని, తర్వాత రైతులకు ఇచ్చిన మాట తప్పాడని అన్నారు. మళ్లీ పసుపు బోర్డు ఏర్పాటు గురించి మాట్లాడుతున్నాడన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇచ్చిన హామీలను ట్యాబ్ ద్వారా రైతులకు ఎమ్మెల్యే వినిపించి, వారు చేసిన మోసాలను ఎండగట్టారు. కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల తరపున పోరాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని, బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎనుగందుల రాజపూర్ణానందం, సొసైటీ చైర్మన్లు పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి, బర్మ చిన్న నర్సయ్య, ఏర్గట్ల సొసైటీ వైస్ చైర్మన్ గంగారాం, మండల ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు భీమనాతి భానుప్రసాద్, గద్దె గంగారాం, పత్తిరెడ్డి ప్రకాశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మోసం చేసే దొంగలను నమ్మకండి

- ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ వంచించింది
- హామీలు అమలు చేస్తే కాంగ్రెస్‌కు ఓటేయండి
- లేకపోతే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పండి
- మాజీ స్పీకర్ పోచారం

రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

వర్ని/మోస్రా, ఏప్రిల్ 27: ఓట్ల కోసం దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తున్నారని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. హామీల పేరుతో మోసం చేసే దొంగలను నమ్మొద్దని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ నమ్మించి వంచించిందని, రైతులకు మోదీ సర్కారు ఢోకా చేసిందని.. ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి మోస్రా, చందూర్, వర్ని మండలాల్లో శనివారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోల్లో పోచారం మాట్లాడారు.

బాన్సువాడలోనే అత్యధికంగా డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించానని, రూ.400 కోట్ల బిల్లులు ఇప్పించానని తెలిపారు. రూ.26 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం మారడంతో అవి మంజూరు చేయడం లేదన్నారు. బిల్లుల కోసం మంత్రిని అడిగితే ఇస్తామన్నారని, కానీ కాంగ్రెస్ నాయకులు ఇవ్వొద్దని మంత్రితో చెప్పడంతో ఇవ్వడం లేదన్నారు. నన్ను నమ్ముకుని పేదలు అప్పుచేసి ఇండ్లు కట్టుకున్నారని, వాళ్లు బాధ పడుతుంటే చూడలేనని తెలిపారు. ఎన్నికల్లోపు బిల్లులు ఇవ్వకుంటే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తానన్నారు. అయినా ప్రభుత్వం స్పందించకపోతే ఆమరణ దీక్ష చేస్తానని, ప్రాణత్యాగానికీ సిద్ధమని ప్రకటించారు. కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని పోచారం విమర్శించారు. దేవుళ్ల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. జై శ్రీరామ్.. జై మోదీ అంటే కడుపు నిండదన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతులకు మోదీ చేసిందేమీ లేదన్నారు. అంబానీ, అదానీలకు రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిండని, రైతులకు నయాపైసా కూడా మాఫీ చేయలేదని విమర్శించారు. అలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు ఓటుతో బుద్ధి చెప్పాలి

వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చాడని, నాలుగు నెలలు దాటినా ఇంతవరకు అమలు చేయలేదని మాజీ స్పీకర్ విమర్శించారు. డిసెంబర్ 9వ తేదీన రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తేదీతో సహా చెప్పారని, ఇప్పుడేమో పంద్రాగస్టు అంటున్నారని ఎద్దేవా చేశారు. మే నెల వస్తున్నా ఎకరాకు రూ.15 వేల రైతుబంధు ఇస్తానన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి, వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. 18 ఏండ్లు దాటిన మహిళలందరికీ రూ.2,500 పింఛన్ వస్తదన్నారు. కల్యాణలక్ష్మి లక్ష చెక్కుతో పాటు తులం బంగారం పెడతామన్నారు. ఇందులో ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా? అని ప్రజలను ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ మీకు అందితే కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని, లేకపోతే ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. హామీలన్నీ అమలు చేస్తే నా ఓటు కూడా కాంగ్రెస్‌కే వేస్తానని తెలిపారు.

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

న్యావనందిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ/ధర్పల్లి, ఏప్రిల్ 27 : కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలను ఇచ్చి గద్దెనెక్కిందని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. సిరికొండ మండలంలోని న్యావనంది, గడ్కోల్‌తోపాటు ధర్పల్లి మండలం హోన్నాజీపేట్‌లో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి, రైతుబంధు, రుణమాఫీ, ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం ఇవ్వకుండా ఎన్నికల కోడ్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఐదేండ్లు ఎంపీగా ఉన్న అర్వింద్ ఈ ప్రాంతానికి చేసింది శూన్యమన్నారు. మోదీని చూసి ఓటు వేస్తే సమస్యలు ఢిల్లీకి వెళ్లి చెప్పుకుంటారా అని ప్రశ్నించారు. ఈ ప్రాంత వాసినైన తనను గెలిపించాలని కోరారు. అంతకుముందు కార్నర్ మీటింగ్ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మాజీ సర్పంచ్ కన్క శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, మహిపాల్ యాదవ్, ధర్పల్లి ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్ పాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ చుట్టూ సీఎం, మంత్రుల ప్రదక్షిణలు

అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 27 : ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. గద్దెనెక్కిన తర్వాత చేస్తున్న మోసాన్ని గమనిస్తున్న ప్రజలు మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చూడాలనుకుంటున్నారని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా జిల్లా కేంద్రంలోని 26వ డివిజన్‌లో ఉన్న అప్నాబజార్, శివాజీనగర్ ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలుచేసిన పథకాలు, జిల్లాకేంద్రంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని కోరారు. పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రైతులను పట్టించుకోకుండా ఢిల్లీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, అధ్యక్ష, కార్యదర్శులు సిర్ప రాజు, సువర్ణ, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సత్యప్రకాశ్, సుజిత్ సింగ్ ఠాకూర్, ఎనుగందుల మురళి, కరిపె రాజు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

రైతులపై రాష్ట్ర సర్కారు చిన్నచూపు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని బీడీ కార్మికురాలిని అభ్యర్థిస్తున్న జీవన్‌రెడ్డి

నందిపేట్, ఏప్రిల్ 27: రైతులపై కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు చూస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో అకాలవర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన శనివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని, దీంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరగడంలేదని మండిపడ్డారు. కోసి ఆరబెట్టిన ధాన్యం వర్షాలకు కల్లాల్లో తడిసిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం ఎకరానికి రూ.15 వేలు, క్వింటాలు ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్ వాటిని అమలుచేయకుండా మోసం చేస్తోందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. చెరువు వద్ద పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ వాకిడి సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, నాయకులు ఎర్రం ముత్యం, ఉల్లి శ్రీనివాస్ గౌడ్, భరత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఏప్రిల్ 27: నిజామాబాద్ ఎంపీ ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. నిజామాబాద్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్, వ్యయ పరిశీలకుడు డీఎం నెమ్జి, పోలీస్ అబ్జర్వర్ రాజేశ్ మీనా కలిసి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్, జగిత్యాల కలెక్టర్లు, జిల్లాల ఉన్నతాధికారులు, నోడల్ ఆఫీసర్లతో శనివారం భేటీ అయ్యారు. ఎన్నికల నియామావళి అమలు, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన చర్యల గురించి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అబ్జర్వర్‌లకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మొత్తం 17,04,867 మంది ఓటర్లకు 1808 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు రూ.1.22 కోట్ల నగదు, రూ.1.28 కోట్ల విలువ చేసే బంగారం, ఇతర వస్తువులతోపాటు 52 వేల లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. సమస్యలు ఏర్పడితే తక్షణ స్పందన కోసం క్విక్ రియాక్షన్ టీమ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్ (ఎంసీఎంసీ), కంట్రోల్ రూమ్‌ను అధికారులు పరిశీలించారు. వివిధ బృందాల పనితీరును జీపీఆర్ఎస్ సిస్టమ్ ద్వారా పరిశీలించారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఎలక్షన్ అబ్జర్వర్లు